ప్రజాశక్తి
శనివారం 24 మే, 2025
5
శ్రీకాకుళం



మామిడి పళ్లు కృత్రిమంగా ముగ్గిస్తే చర్యలు

శ్రీకాకుళం : మామిడి పళ్లను కృత్రిమంగా ముగ్గిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారి కె.వెంకటరత్నం హెచ్చరించారు. జిల్లాలోని మార్కెట్, పరిసర ప్రాంతాలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు పళ్ల దుకాణాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. కృత్రిమంగా పళ్లను మాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మామిడి పళ్లను శాంపిల్స్ తీసికొని లేబ్‌కు పంపించారు.



మామిడి పళ్లను పరిశీలిస్తున్న వెంకటరత్నం

కౌలు రైతులకు ఈ ఏడాదీ కష్టాలు తప్పేటట్టు లేవు. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ మొదలు కానుంది. పంట సాగు హక్కుదారుల పత్రాలు (సిసిఆర్‌సి) ఇప్పటికే అందించాల్సిన ప్రభుత్వం ఆ ప్రక్రియ ప్రారంభించలేదు. అక్కడక్కడ గతంలో జారీ చేసిన కార్డులను రెవెన్యూ సిబ్బంది రెన్యువల్ చేస్తున్నారు. ఏ విధంగా చూసుకున్నా కొత్త కార్డుల జారీకి మరికొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. దీంతో సబ్సిడీపై విత్తనాలు, బ్యాంకు రుణాలు అందుతాయో లేదోనన్న ఆందోళన కౌలు రైతుల్లో నెలకొంది.

కౌలు కార్డులు లేక ఇబ్బందులు



కౌలు గుర్తింపు కార్డులు లేక గతేడాది సబ్సిడీపై విత్తనాలకు నోచుకోలేకపోయాం. బ్యాంకుల నుంచి రుణాలూ పొందలేకపోయాం. ప్రభుత్వం ఈ సంవత్సరమైనా వెంటనే కార్డులు ఇస్తే రైతులకు మేలు జరగుతుంది.

- ఆర్.పట్టాభినాయుడు, కిలంత్రిరి (బూర్జ)

కౌలు రైతులను ఆదుకోవాలి



కౌలు గుర్తింపు కార్డులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. రాయితీలూ రావడం లేదు. వర్షాలు, తుపాన్లకు పంటలు కోల్పోయినా పరిహారానికి నోచుకోలేకపోతున్నాం. పంట చేతికి వచ్చినా రాకపోయినా యజమానికి ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లిస్తున్నాం. కౌలు కార్డులు ఇస్తే కొంతవరకైనా మా కష్టాలు తీరతాయి

- మజ్జి సూర్యనారయణ, అన్నంపేట (బూర్జ)

'కౌలు' కష్టాలు తీరేనా?

- **జిల్లాలో ఈ ఏడాది 9,800 మందికి ఇవ్వాలని లక్ష్యం**
- **కొత్త కార్డుల జారీలో జాప్యం**
- **ప్రస్తుతం రెన్యువల్‌కే అవకాశమిస్తున్న ప్రభుత్వం**



పొలం దున్నుతున్న రైతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి , బూర్జ

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటలు కలిపి సుమారు 4,47,383 ఎకరాల విస్తీర్ణం మేర సాధారణ సాగుగా ఉంది. ప్రస్తుత ఖరీఫ్‌లో 4,53,973 ఎకరాల్లో రైతులతో పంటలు వేసేలా లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అందులో ప్రధాన పంట వరిని 4,07,500 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో దాదాపు 2 లక్షల ఎకరాల పైన కౌలు రైతులే సాగుచేస్తున్నారు. జిల్లాలో సుమారు లక్ష మందికి పైగా కౌలు రైతులు ఉంటారని ఒక అంచనాగా ఉంది. ఈ సంవత్సరం 9,800 మందికి సిసిఆర్‌సి కార్డులను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే గుర్తింపు ప్రక్రియ ఇప్పటివరకు మొదలు కాలేదు. కేవలం గతంలో ఇచ్చిన కార్డులను రెన్యూవల్ చేయడానికే ప్రభుత్వం పరిమితమవుతోంది. ఇప్పటివరకు 523 మంది కౌలు రైతులకు సంబంధించిన కార్డులను రెన్యువల్ చేసినట్లు తెలుస్తోంది.

భూ యజమానులు సమ్మతి తెలిపేనా?

గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసే ప్రక్రియ 2019 వరకు సాగింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పంట సాగు హక్కుదారుల చట్టం-2019ను తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలంటే భూ యజమాని రాత పూర్వక అగ్రిమెంటు తీసుకోవాలి. అధిక శాతం మంది భూ యజమానులు ససేమిరా అంటున్నారు. దీంతో కౌలు రైతులు సిసిఆర్‌సి గుర్తింపుకు దూరం మవుతున్నారు. గతేడాది 6050 కార్డులను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినా సగం కూడా ఇవ్వలేకపోయారు.

సిసిఆర్‌సి కార్డుల జారీకి చర్యలు

సిసిఆర్‌సి కార్డుల జారీకి అవసరమైన చర్యలు చేపడుతున్నాం. ఈ ఎడాది 9,800 కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించాం. ప్రస్తుతం రెన్యూవల్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. కౌలుకు భూ యజమానుల సమ్మతి తెలియజేయాల్సి ఉంటుంది. భూమి సొంతదారులు అంగీకరిస్తే వీలైనంత ఎక్కువ మందికి కార్డులు ఇచ్చే అవకాశం ఉంది.

- త్రినాథస్వామి, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు



మాట్లాడుతున్న లోకనాథం

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు దుర్మార్గం

● యాక్సిస్, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలి ● సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను పగులగొట్టండని పిలుపు నిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఏర్పాటు చేయడం దుర్మార్గమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనిట్ విద్యుత్‌ను రూ.4.60 చొప్పున కొనుగోలు చేసేందుకు యాక్సిస్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. యాక్సిస్, సెకీ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు ప్రజలపై కరెంట్ ఛార్జీల భారాన్ని మోపనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని ఎన్నికలకు ముందు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఛార్జీలను రెట్టింపు చేయడం దగా కాదా? అని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై పాతికేళ్లపాటు రూ.15 వేల కోట్లు భారం వేసే ఈ ఒప్పందాన్ని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఎపిఇఆర్‌సి) ఆమోదముద్ర వేయడం అన్యాయమని అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం (2003)లోని 108వ సెక్షన్‌ను ప్రయోగించడం గర్హనీయమని పేర్కొన్నారు. యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ నుంచి యూనిట్ కరెంట్‌ను రూ.4.60లు చొప్పున కొనుగోలు చేసేందుకు కంపెనీలు చేసుకున్న ఒప్పందాన్ని ఆమోదిస్తూ ఎపిఇఆర్‌సి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. యాక్సిస్ కంపెనీకి పాతికేళ్లపాటు 400 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ద్వారా రూ.15 వేల కోట్లు పైగా లబ్ధి కలుగుతుందని వివరించారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడే 2018లో ఈ దోపిడీకి ప్రయత్నించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం మారాక కోర్టుల చుట్టూ తిరిగిందని తెలిపారు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక యాక్సిస్ కంపెనీ పాత ప్రతిపాదనను డిస్కామ్ ఆమోదించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం (2003)లోని సెక్షన్ 108 కింద రిఫర్ చేయడం ద్వారా ఎపిఇఆర్‌సి కూడా ఆమోదముద్ర వేయాల్సిన తప్పనిసరి పరిస్థితిని కల్పించిందని వివరించారు. దీంతో రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం పడనుందని చెప్పారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చివరి భూముల వరకు రెండు పంటలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకాలను బాగు చేయించాలని, కాలువలు పూడికలు తొలగించి షట్టర్లు బిగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని జిల్లాలో ఐటిడిఐ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, జీడికి 80 కేజీలు బస్తాకు రూ.16 వేలు గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. పి ఫోర్ పేరుతో శ్రీకాకుళం నగరంలోని ఆస్తులను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడితే సహించేది లేదని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నాలుగు లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా జూలై 9 జరుగు దేశ వ్యాప్త సమ్మెకు సిపిఎం పార్టీ తన సంపూర్ణ మద్దతు తెలిపింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు సిర్ల ప్రసాదరావు, సిహెచ్.అమ్మన్నాయుడు, పోలాకి ప్రసాదరావు మాట్లాడారు.

తెలుగు పోస్టులను పునరుద్ధరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రాథమికోన్నత పాఠశాల్లో తెలుగు పోస్టులను పునరుద్ధరించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా శాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2001 నుంచి విస్తృతంగా ప్రాథమికోన్నత పాఠశాలలు నెలకొల్పిన నాటి నుంచి ఇప్పటి వరకు సబ్జెక్టు టీచర్లకు కొరత లేకుండా బోధన జరిగిందన్నారు. కానీ, పాఠశాల విద్యాశాఖ తాజాగా జారీ చేసిన రేషన్లైజేషన్ జిఒలో ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడి పోస్టును లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 75 మంది విద్యార్థులు ఉంటే ఉన్నత పాఠశాల మంజూరు చేసిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాథమికోన్నత పాఠశాలల్లో 141 మంది విద్యార్థుల రోల్ దాటితే తెలుగు పోస్టు ఇస్తామని చెప్పడం ఆశ్చర్యకరం ఉందన్నారు. తక్షణమే పాఠశాల విద్యాశాఖ తీసుకొచ్చిన హేతుబద్ధీకరణ జిఒలో హేతుక అంశాలను తొలగించాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు పోస్టును పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో కూన రంగనాయకులు, గొడబ మేరీప్రసాద్, చింతపల్లి జనార్ధనరావు, మజ్జి వెంకట రమణ, అరసవిల్లి గణపతిరావు, మజ్జి వెంకటరమణ, రాడ గణపతిరావు, వడిగి రమణమూర్తి, సంధ్యారాణి, దున్న విజయలక్ష్మి పాల్గొన్నారు.

తనిఖీల పేరుతో క్వారీల మూత




మూతపబడిన క్వారీ

ప్రజాశక్తి- టెక్కలి

మెళియాపుట్టి మండలం దీనబంధుపురం గ్రామం వద్ద గల ఒక గ్రానైట్ కంపెనీలో సంభవించిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటన నేపథ్యంలో క్వారీలో తనిఖీల పేరుతో గ్రానైట్ క్వారీ పరిశ్రమలు మూతబడ్డాయి. గడచిన కొద్ది సంవత్సరాలుగా మూతబడ్డ క్వారీలు కుటమి ప్రభుత్వ హయాంలో తెరుచుకున్నాయి. దీంతో సంక్షోభంలో ఉన్న క్వారీలు మరలా పుంజుకుంటున్నాయి. ఈ తరుణంలో తనిఖీలు జరిగినంత వరకు క్వారీలు పనిచేయడానికి వీలులేదని టెక్కలి ఆర్‌డిఒ ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రస్తుతం క్వారీలు మూతబడ్డాయి. దీంతో యాజమాన్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రాయి ఎగుమతులకు షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇటువంటి తరుణంలో షిప్‌ల ద్వారా ఇతర దేశాలకు రాయిని ఎగుమతులు చేయించుకోవాల్సిన యజమానులు క్వారీలు మూతబడడంతో రాయి ఎగుమతులు కూడా నిలిచిపోయింది. షిప్‌లు వెళ్లిపోయిన తర్వాత క్వారీలు రాయిని తీసిన ఎగుమతులు లేకపోవడంతో ఇక్కడే నిలిచిపోవాల్సి ఉండడంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. కాగా, గ్రానైట్ క్వారీలను ఆసరాగా చేసుకుని వందలాది మంది కార్మికులు ఉపాదిని పొందుతున్నారు. ప్రస్తుతం క్వారీలు మూతబడడం వల్ల కార్మికులకు ఉపాధి కూడా దూరమయింది. ఇదిలా ఉండగ గతంలో క్వారీలు మూతబడిన నేపథ్యంలో మెయింటెన్స్ కోసం యజమానులు పెట్టుబడులు పెట్టారు. ఈ క్రమంలో లక్షలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టడం వల్ల ఇప్పుడు వాటికి వడ్డీలు చెల్లించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడడంతో ఆర్థికంగా నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని యజమానులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా తనిఖీల కోసం బృందాలు వస్తున్నా వారు ముమ్మరంగా తనిఖీలు చేయడంలో ఆలస్యం జరుగుతుండడంతో తమ క్వారీలు ఎప్పుడు తనిఖీ జరిగి క్లియరెన్స్ ధ్రువపత్రం వస్తుందా? అని యజమానులు ఎదురుచూస్తున్నారు. కాగా, క్వారీల నిర్వహణకు అన్ని అనుమతులు సజావుగా ఉంటే సంబంధించిన కాపీలు మండలస్థాయి అధికారులకు చూపించి క్లియరెన్స్ ధ్రువపత్రాలు తీసుకోవచ్చునని ఆర్‌డిఒ సమావేశంలో చెప్పినా వాస్తవ రూపంలో అది అమలు సాధ్యం కాకపోవడంతో యజమానులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఏదేమైనా తనిఖీల పేరుతో గ్రానైట్ క్వారీలు మూతబడడం వల్ల అటు యజమానులు ఇటు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలను వేగవంతం చేసి క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఎండియు వాహనాల రద్దు తగదు

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్




శ్రీకాకుళం: పేదల ఇళ్లకు నాణ్యమైన రేషన్ బియ్యం అందించేందుకు వైసిపి ప్రభుత్వం ప్రారంభించిన ఎండియు వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం తగదని జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేసే విధానాన్ని తొలగించడం వల్ల వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. వేలాది మంది లబ్ధిదారులు మైలేజ్ ఖర్చు లేకుండా, క్యూల్లో నిలబడాల్సిన అవసరం లేకుండా నాణ్యమైన రేషన్‌ను పొందే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవీయ దృక్పథంలో ఆలోచించి ఎండియు వాహనాలను కొనసాగించి ఇంటి వద్దరే రేషన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నేరుగా మేలు చేసిన కార్యక్రమాన్ని రాజకీయ కక్షలు పెట్టుకుని రద్దు చేయడం అనైతికమన్నారు. ఇది పేదల ఆకలి మీద రాజకీయం చేసినట్టేనన్నారు. వైసిపి తరుపున మేము ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేదల హక్కులను కాపాడేందుకు వారి న్యాయమైన రేషన్ హక్కు పునరుద్ధరించేందుకు అన్ని మాధ్యమాల్లో పోరాడతామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం : జిల్లాలోని పలాస, టెక్కలి, శ్రీకాకుళం 1, 2వ డిపోల పరిధిలోకి వచ్చే ఆర్‌టిసి బస్ స్టేషన్ల పరిధిలోని 66 షాపుల్లో వ్యాపారం నిర్వహించేందుకు ఔత్సాహిక వ్యాపారవేత్తలు టెండర్ ఫారం ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28లోగా డిపో మేనేజర్ల కార్యాలయాల్లో టెండరు ఫారాలు అన్ని పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు కొనుగోలు చేయవచ్చునన్నారు. ఈ నెల 29న మధ్యాహ్నం రెండు గంటలలోపు టెండర్ ఫారాలను బాక్స్‌లో వేయాలన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో బాక్సులను తెరుస్తారని తెలిపారు. ఆసక్తి గల వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- పలాస

ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో వచ్చే ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీసు అధికారులను ఆదేశించారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ప్రజా పిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి సమస్యలను విని, సానుకూలంగా స్పందించి, వారి సమస్యలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులను ఆదేశించారు. ఆయా పిర్యాదులపై తీసుకున్న చర్యలు, నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని సూచించారు. సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట, మిస్సింగ్, చీటింగ్ ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు అందాయని చెప్పారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

వైసిపి పార్లమెంట్ పార్టీ పరిశీలకులు రవిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళంప్రతినిధి

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం వదిలేసి రెడ్‌బుక్ పాలన చేస్తోందని వైసిపి పార్లమెంట్ పార్టీ పరిశీలకులు కుంభా రవిబాబు అన్నారు. పాత్రునివలసలోని స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ ముఖ్యనేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ బిసిలకు 50 ఏళ్లు దాటిన వారికి పింఛను ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు దాని ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. పార్టీ పటిష్టతకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అభిమానులకు సరియైన గుర్తింపు ఇస్తామని చెప్పారు. పార్లమెంటరీ పార్టీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర డాక్టర్స్ విభాగం అధ్యక్షులు సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆరాచకపాలన సాగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కార్యకర్తలను నాయకులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అనంతరం పార్టీ క్రమ శిక్షణ కమిటీ సభ్యులుగా నియమితులైన రెడ్డి శాంతిని అంతా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయ కర్తలు చింతాడ రవి కుమార్, గొర్లె కిరణ్ కుమార్, పేరాడ తిలక్, రాష్ట్ర కార్యదర్శి కిల్లి సత్యనారాయణ, వివిధ కార్పొరేషన్ మాజీ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, ఎంపిపిలు అంబటి నిర్మలశ్రీనివాస్, గొండు రఘురాం, భైరాగి నాయుడు, పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కష్ణచైతన్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ఎచ్చెర్ల శ్రీధర్, ఎం.స్వరూప్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పుత్రశోకం

కన్నీటి రోదనల మధ్య మెడికో విద్యార్థి అంత్యక్రియలు



మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి భాస్కరరావు

ప్రజాశక్తి- టెక్కలి

కడుపుచింకుకు పుట్టిన బిడ్డ పెరిగి పెద్దయి తమ అండగా ఉంటాడని భావించారు. కన్నకొడుకుకి కష్టం తెలీకుండా పెంచిన చేతులవి. చిన్ననాటి నుంచి ఆలనాపాలనా చూసుకునే తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చాడు ఆ కుమారుడు. ఉన్నత చదువులు చదివి అందివచ్చాడని ఆశించిన ఆ తల్లిదండ్రుల కల్లెదుటే కుమారుడు కట్టెల మీద భూడిద ఆవుతున్న దృశ్యాన్ని తట్టుకోలేకపోయారు. పెంచిన చేతులతోనే తలకొరివి పెట్టాల్సిన దుస్థితి ఆ తండ్రికి ఏర్పడింది. విశాఖపట్నంలో మెడికల్ పిజి చదువుతున్న సింగుపురం మోతీలాల్ గురువారం ఆత్మహత్యకు పాల్పాడ్డాడు. శుక్రవారం మండలంలోని నర్సింగపల్లి పంచాయతీ జగన్నాథపురంంలో కన్నీటి రోదనల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు భాస్కరరావు పెద్దకుమారుడు మోతీలాల్ ఎంబిబిఎస్ జిప్‌మర్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. రేడియాలజీ కోర్సులో పిజి చదువు నిమిత్తం విశాఖపట్నంలో మెడికల్ వసతి గృహంలో ఉంటున్నాడు. గురువారం రాత్రి వసతిగృహంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు విశాఖపట్నం వెళ్లి మోతీలాల్ మృతదేహన్ని స్వగ్రామమైన జగన్నాథపురం గ్రామం తీసుకువచ్చి శుక్రవారం సాయంత్రం ఆంత్యక్రియలు నిర్వహించారు. అందివచ్చిన కొడుకు అందని తీరాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు పడే బాధ వర్ణనాతీతం. మోతీలాల్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మోతీలాల్ ఆరో నుంచి పదో తరగతి వరకు సరుబుజ్జిలి మండలం జవహర్ నవోదయ వెన్నెలవలస చదువుకున్నాడు. మోతీలాల్ మృతి చెందడంతో సహచర విద్యార్థులు గ్రామానికి చేరుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి



శ్రీకాకుళం : తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలోని మద్యం షాపులు, రెస్టారెంట్లు, బార్లు నిబంధనలకు అనుగుణంగా పనిచేసే విధంగా చూడడానికి ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యాన నైట్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని తీసుకొచ్చామని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు నగరంలోని రెస్టాండర్లను, మద్యం షాపులను గురువారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సమయపాలన, విడివిక్రయాలు, ఎంఆర్‌పికి మించి అమ్మకాలు లేకుండా చూడటం, అనధికార షిట్టింగ్‌లను నివారించడం, షాపు పరిసరాలన్నీ శుభ్రంగా ఉంచడం, షాపుల్లో రికార్డులు సమర్థవంతంగా నిర్వహించడం, సిసి కెమెరా పనితీరును పరిశీలించడం వంటి ప్రధానమైన నిబంధనలో కచ్చితంగా అమలు అయ్యేందంగా ఉపయపడుతుందన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఇవ్వాలనుకుంటే టోల్ ఫ్రీ నంబరు 14405 ఫోన్ చేయాలన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

పాతపట్నం : మండల పరిధిలోని మద్యం షాపులు మూసివేసిన తరువాత చుట్టుపక్కల ఉన్న పాన్‌షాప్‌ల్లో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో బెల్ట్ షాపులు నిర్వహించి అక్రమ మద్యం అమ్మకాలు చేపట్టినా, బహిరంగంగా తాగినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ కృష్ణారావు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం పాన్‌షాప్‌లు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత్రి 8 గంటల నుంచి రాత్రిపూట గస్తీని నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి పది గంటల తరువాత అక్రమంగా మద్యం కలిగి ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పేదలకు సిఎం సహాయనిధి వరమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక మహాలక్ష్మినగర్ కాలనీకి చెందిన వనరాస సురేష్ రహదారి ప్రమాదంతో అనారోగ్య కారణంగా మంచానికే గత కొంతకాలంగా పరిమితమయ్యారు. ప్రస్తుతం చికిత్స పొందుతూ లివర్ సంబంధిత వ్యాధితో కూడా బాధపడుతున్నారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆర్థిక స్థోమత అడ్డంకాగా సిఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా స్పందించిన ఎమ్మెల్యే సిఎం సహాయనిధి నుంచి రూ.66, 900 చెక్‌ను బాధితునికి ఎమ్మెల్యే కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంతో అత్యుత్తమ అభివృద్ధి సాధ్యమని, శారీరకంగా, దృడంగా ఉంటేనే జీవించగలమన్నారు. కార్యక్రమంలో సురేష్ కుటుంబ సభ్యులు, స్థానికులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న సహిత ఉపాధ్యాయులు

కొనసాగుతున్న సర్వే

కవిటి: సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యాన జిరో నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపుకు ఇంటింటికీ నిర్వహిస్తున్న సర్వే కొనసాగుతున్నట్టు ఎంఇఒ ధనుంజయ మజ్జి తెలిపారు. మే 13 నుంచి జూన్ 9 వరకూ జరిగే ఈ సర్వేలో వినికిడి లోపం, దృష్టి లోపం, ఆటిజం, రక్త హీనత, మాట్లాడలేకపోవడం, మానసిక సమస్యలు వంటి ఇరవై ఒక్క రకాల వైకల్యాలు గుర్తించి వారిని సమీపంలో పాఠశాలలో చేర్పించడం ద్వారా వారి అవసరాలు సమకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకూ మండలంలో పది మంది వికలాంగ విద్యార్థులను గుర్తించినట్టు తెలిపారు. వీరికి కళ్లద్దాలు, చెవిటి మిషన్లు, మూడు చక్రాల సైకిళ్లు వంటి వాటిని ఉచితంగా అందించడమే కాకుండా లోపం కలిగిన మహిళలకు ఏడాదికి రూ.2 వేలు స్టైఫండ్ కూడా అంది స్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉండే ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు సహిత విద్య ఉపాధ్యాయులు కృష్ణారావు 8247393043, అరుణ్‌కుమార్ 9391164018లకు తెలియజేయాలని సూచించారు.

ఇంటర్ సిటీ వేళలు మార్చాలని వినతి

ఇచ్ఛాపురం: బరంపురం నుంచి విశాఖపట్నం నడుస్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ వేళలు మార్చాలని డిఆర్‌యుసిసి సభ్యులు కె.సూర్యప్రకాశరావు కోరారు. ఈ మేరకు వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ లలిత్ భోహ్రను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం నడుస్తున్న బరంపురం నుంచి బయలు దేరుతున్న సమయం ఉదయం 9:45 గంలకు బదులు ఉ.5 గంటలకు బయలు దేరేటట్టు మార్చిస్తే ప్రయాణికులకు మేలు చేకూరుతుందన్నారు. విశాఖపట్నం ఉదయం 9.50 గంటలకు వెళ్లేటట్టు మార్పులు చేస్తే... ఉద్యోగులకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోకరంగా ఉంటుందన్నారు. అలాగే సీనియిల్ డివిజినల్ కమర్షియల్ కె.సందీప్‌ను కూడా కలిశారు. అదే విధంగా భువనేశ్వర్ - విశాఖపట్నం మధ్య నడుస్తున్న వందే భారత్‌ను కాకినాడ వరకు పొడిగించాలని కోరారు.



కేక్ కట్ చేస్తున్న కార్యకర్తలు

ఘనంగా బాబూరావు జన్మదినం

పలాస : కాశీబుగ్గ అన్న క్యాంటీన్ ప్రాంగణంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు జన్మదిన వేడుకలను శుక్రవారం అభిమానులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అందరినీ పంచిపెట్టారు. ఇందులో భాగంగా అన్న క్యాంటీన్‌లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి అల్పాహారం ఉచితంగా పెట్టారు. కార్యక్రమంలో సాసుమాన చంద్రమౌళి, రుప్ప ప్రసాదరావు, దాసు, జగదీష్ పండా, శ్రీనివాసరావు పండా తదితరులు పాల్గొన్నారు.

ఆనందడోలికల్లో రేషన్ డీలర్లు

కవిటి: ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనాలు రద్దు చేస్తూ, జూన్ 1 నుంచి మళ్లీ రేషన్ డీలర్ల ద్వారానే సరుకులు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై రేషన్ డీలర్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

టెక్కలి : సివిల్ సప్లయి డిటి కార్యాలయం వద్ద డీలర్లు సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షులు కిడిమి శ్రీనివాసరావు, కార్యదర్శులు వసంతకుమార్, చిట్టెమ్మ, దుంప ఉపేంద్ర రావు, బి.జగన్నాథం, కిల్లాన ఢిల్లీబాబు, జానకి, సుధీర్ పాల్గొన్నారు.

700 మందితో యోగా శిబిరం

శ్రీకాకుళం: నగరంలోని పట్టణంలోని 80 అడుగుల రోడ్డులో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన శుక్రవారం యోగా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, గార మండలాల నుంచి ఐసిడిఎస్ సిబ్బంది, చిల్డ్రన్ హోమ్స్‌కు చెందిన చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొత్తం 700 మందికి పైగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం విశేషం. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ సమన్వయ అధికారి డాక్టర్ జగదీష్, ఐసిడిఎస్ అధికారి బి.శాంతిశ్రీ, నోడల్ అధికారి మనెమ్మ, మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు. యోగా ద్వారా శరీర దృఢత్వం, మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని, ప్రజలు యోగా ప్రాము ఖ్యతను తెలుసుకొని దాన్ని జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

నేడు, రేపు జర్మనీలో మినీ మహానాడు

పలాస : ఈ నెల 24,25 తేదీల్లో జర్మనీ దేశంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మినీ మహానాడులో పాల్గొనేందుకు ఎమ్మెల్యే గౌతు శిరీష, నియోజకవర్గ సమన్వయ కర్త వెంకన్న చౌదరి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఈ మేరకు శుక్రవారం జర్మనీ ఎయిర్ పోర్టుకు చేరుకున్న ఎమ్మెల్యే దంపతులు చేరుకున్నారు. అక్కడి మినీ మహానాడు ఆహ్వాన కమిటీ సుమంత్ కొర్రపాటి, అఖిల్ దున్న, రాజశేఖర్ పార్ణపల్లి, విక్రమ్ కుమార్ తల్లపనేని, కళ్యాణ్ సుంకు, తదితరులు పుష్ప గుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం

పాతపట్నం : పాతపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని తెంబూరు అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ టి.విమలరాణి ఆధ్వర్యాన కిషోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 నుంచి 18 ఏళ్ల బాలికలందరకు ఉన్నత విద్య నైపుణ్యం, కెరీర్ మార్గదర్శకత్వం గురించి వివరించారు. బాలికలు తీసుకునే ఆహారంపై జాగ్రత్తలు, కౌమారంలో ఉండే బాలికలందరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ డి.అమరావతి, కార్యదర్శి పి. సిమన్న, కార్యకర్త హరిణి, ఐసిపిఎస్ సోషల్ వర్కర్ జనార్ధన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఆమదాలవలస : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం విశాఖ ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం రూరల్ మండలం, శ్రీకాకుళం పట్టణం నుంచి పెద్దఎత్తున ప్రజలు వచ్చి వినతులు అందించారు. ప్రతిఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపిస్తామని ఎమ్మెల్యే అన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో పెద్దఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, కాలువలు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడు తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పలు సమస్యలపై అర్జీలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ప్రజాదర్బార్ లో వచ్చిన వినతులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, పింఛను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు, నూక రాజు, అంబళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్ : అర్జీదారునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- రణస్థలం రూరల్



హేమంత్ కుమార్

విజయనగరం జిల్లా కోరుకొండలో ఉన్న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో మండలంలోని కోష్ట జంక్షన్‌లో ఉన్న సక్సెస్ స్కూల్ విద్యార్థి చిత్రి హేమంత్ కుమార్ ఉత్తీర్ణత సాధించాడు. సక్సెస్ స్కూల్ డైరెక్టర్ కరిమజ్జి రమణ, కరస్పాండెంట్ కె.దేవి విద్యార్థి హేమంత్‌ను అభినందించారు. మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. వీరితో పాటు స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు కళాకారుల సమావేశం

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో ఈనెల 25న ఉదయం తొమ్మిది గంటలకు జరుగు కళాకారుల సంక్షేమ సంఘ సమావేశానికి నియోజకవర్గ కళాకారులంతా తరలిరావాలని కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు టేకి త్రినాథరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుంచి రావాల్సిన గుర్తింపు కార్డులు, పేద కళాకారులకు అందించాల్సిన ఆర్థిక సహాయం, కళాకారుల సంక్షేమ సంఘం భవిష్యత్ కార్యక్రమాలపై చర్చ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గ నిర్మాణం కూడా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు, దాస్యం లక్ష్మణరావు, కె.రామారావు, జి.జోగారావు, ఎం. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పొందూరు: పొందూరు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎఇ వి.సుధీర్ తెలిపారు. ఉపకేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా టౌన్ ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్, సిరిపురం ఫీడర్, కృష్ణాపురం ఫీడర్ పరిధిలోని పొందూరు పంచాయతీ, రాపాక, కొంచాడ, తండ్యాం, మలకాం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని తెలిపారు. వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

27న అరసవల్లి హుండీల ఆదాయం లెక్కింపు

శ్రీకాకుళం : అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం హుండీల ఆదాలయం ఈ నెల 27న లెక్కిస్తామని ఉప కమిషనర్, కార్యనిర్వాహక అధికారి భద్రాజి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 8 గంటలకు హుండీలను తెరుస్తామన్నారు. డిపార్ట్‌మెంట్, అనువంశిక ధర్మకర్త, అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరుస్తామన్నారు.



రోడ్డు మధ్యలో గొయ్యిలా ఏర్పడిన కల్వర్టు

కల్వర్టు పలకలు సరిచేయాలి


ప్రజాశక్తి- శ్రీకాకుళం

కిమ్స్ రోడ్డు నుంచి పిఎన్ కాలనీకి వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టులో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు నిలిచిపోతుండడంతో ఇటీవల మున్సిపల్ అధికారులు కల్వర్టుపై నున్న పలకలు తొలగించి చెత్తాచెదారాన్ని బయటకు తీసి పలకలను మరలా అమర్చారు. అయితే పలకలు అమర్చినప్పుడు రోడ్డుకు సమాంతరంగా ఏర్పాటు చేయక పోవడంతో అక్కడ గొయ్యిలా మారిపోయి ద్విచక్ర వాహనదారులు, పాదచారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో గొయ్యి కనిపించకపోవడంతో చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ముమ్మర తనిఖీలు

ఆమదాలవలస: జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ చర్యల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. స్థానిక పోలీసులు, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ సంయుక్తంగా ప్రత్యేక పోలీసు జాగిలాలతో రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులతో పాటు రైలు నుంచి దిగిన ప్రయాణికుల లగేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు అవగాహన కల్పిస్తూ అపరిచిత వ్యక్తుల లగేజీ బ్యాగులను, ఇతర సామగ్రిని ఏ ఒక్కరు తమ ఆధీనంలో ఉంచరాదన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ బాలరాజు, జిఆర్‌పి ఎస్ఐ మధుసూదనరావు, ఆర్‌పిఎఫ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వ



నిల్వ ఉన్న వర్షపునీరు

కొత్తూరు: మండల కేంద్రంలోని పాలకొండ రహదారిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నీరు నిల్వ ఉండిపోయింది. రోడ్డుకు ఇరువైపులా కాలువ నిర్మాణం లేకపోవడంతో త్రినాథస్వామి ఆలయం సమీపంలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహన దారులు, పాదచరులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వర్షపు నీరుతో రహదారులు గోతులమయం కావడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు ఇరువైపులా కాలువలు నిర్మాణం చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైసిపిని తిట్టడమే మహానాడు ప్రధాన అజెండా

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపిని తిట్టడమే లక్ష్యంగా మినీ మహానాడు ప్రధాన ఎజెండాగా కొనసాగిందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో నున్న వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి నిర్వహించిన మినీ మహానాడుకు వచ్చిన జనాలంతా ఉపాధిహామీ కూలీలని, వారికి మస్టర్లు వేసి మహానాడుకు తరలించారని, స్వచ్ఛందంగా వచ్చిన వారు చాలా తక్కువ మంది అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక వైసిపిని తిట్టడమే మహానాడు ప్రధాన అజెండాగా కొనసాగిందన్నారు. సంవత్సర కాలంలోనే కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని, టిడిపి నాయకులు ప్రజలకు సమాధానం చెప్పలేక బెదిరింపులకు పాల్పడి, అక్రమ కేసులు బనాయించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండి పడ్డారు. సూపర్ సిక్స్‌లో ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేని కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ, రాష్ట్ర సంపద మొత్తాన్ని అమరావతిలో పెడుతున్నారని అన్నారు. మినీ మహానాడులో ఎమ్మెల్యే, కేంద్రమంత్రి ఇద్దరూ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధిని వైసిపి అడ్డుకుంటుందని అబద్దాలు చెప్పారని, జిల్లాలో అభివృద్ధి వైసిపి హయాంలోనే జరిగిందని టిడిపి నాయకులకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని రవికుమార్ సవాల్ విసిరారు. ఎమ్మెల్యే రవికుమార్ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి ఇసుక దోపిడీ చేస్తూ రోజుకు సుమారు రూ.కోటి స్వాహ చేస్తున్నారని విమర్శించారు. మద్యం షాపుల నుంచి 20 శాతం మామూళ్లు వసూలు చేసుకుంటూ దోపిడీ చేసిన సొమ్ముతో అమెరికాలో హోటల్ కట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని రవికుమార్ అన్నారు. సమావేశంలో సరుబుజ్జిలి జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, సరుబుజ్జిలి వైసిపి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఇంజినీర్లకు సన్మానం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు

ప్రజాశక్తి- రణస్థలం

పర్యావరణాన్ని, వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పుట్టపర్తి నుంచి వచ్చిన ఎలక్ట్రికల్ ఇంజినీర్, సామాజిక వేత్త రాజు సూచించారు. కోష్ట పంచాయతీలో మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీ నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు తెలుగు భాష ప్రాధాన్యాన్ని వివరించారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను విస్మరించవద్దన్నారు. మానవతా విలువలు, సేవాభావం చిన్నప్పటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెడిటేషన్, సూర్య నమస్కారాల విశిష్టత వివరించి సాధన చేయించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడుతూ పిల్లల భవిష్యత్ కోసం పాటు పడతారని, వారికి నిజమైన సంతోషం పిల్లల ఎదుగుదలలోనే ఉంటుందన్నారు. చదువులో రాణిస్తూ తల్లిదండ్రులకు, గురువులకు పేరు తీసుకురావాలని సూచించారు. చేస్తున్నది చిన్న ఉద్యోగమే అయినా సామాజిక బాధ్యతగా ఇంత మంచి కార్యక్రమం చేస్తున్న అమ్మోజీని అభినందించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బమ్మిడి అమ్మోజీ, విద్యార్థుల తల్లిదండ్రులు వారికి సత్కరించారు. ఎంపిడిఒ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ విజయేంద్ర, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేపట్టాలి

ప్రజా సంఘాల నాయకుల నిరసన భగ్నం

పలాస: సిపిఐ మావోయిస్టు పార్టీ అఖిలభారత ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు గంగన్న ఆయనతోపాటు 27 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హత్యను వ్యతిరేకిస్తూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, లిబరేషన్, పౌర హక్కుల సంఘం, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం, అమరుల బంధుమిత్రుల సంఘం, ప్రజా కళామండలి, ప్రగతిశీల కార్మిక సమైక్య కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ తన సిబ్బంది చేసుకుని నిరసనకు అనుమతులు లేవని అడ్డుకుని భగ్నం చేశారు. ప్రజా సంఘాల నాయకులను బలవంతంగా కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేశవరావు భౌతికకాయం కుటుంబ సభ్యులకు అప్పగించాలన్నారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు చేపట్టాలని, ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. రాజ్యాంగబద్ధంగా పాలించాల్సిన పాలకలు చట్టాలను ఉల్లంఘించి అన్యాయంగా, దుర్మార్గంగా దేశ పౌరులైన ఆదివాసీల పైన, మావోయిస్టులను లక్ష్యంగా చేసుకుని 550 మందిని పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్లకు అడవులను అప్పగించడానికే ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని విమర్శించారు. న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి ధానేషు, లిబరేషన్ నాయకులు రామారావు, పిడియం రాష్ట్ర నాయకులు సాలిన వీరాస్వామి, జీడి రైతు సంఘం నాయకులు తెప్పల అజయ్ పాల్గొన్నారు.



నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సాగునీటి వనరుల సంరక్షణపై దృష్టి



శంకుస్థాపన చేస్తున్న కిరణ్‌కుమార్

వజ్రపుకొత్తూరు: సాగునీటి వనరులు సంరక్షణపై ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టిసారించారని తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి కొనారి కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని తుంబవానిపేట వంశధార కాలువకు సంబంధించి ఒటి తూము పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో ఉపాధి హామీ నిధులు రూ.2 లక్షలతో తూము పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే శిరీష అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార కాలువ శివారు గ్రామాలకు సాగునీరు తీసుకొచ్చారని గుర్తు చేశారు. రూ.1.65 కోట్లతో మండలంలో 25 సాగునీటి వనరులు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి చేనుకూ నీరు అందించే దృఢ సంకల్పంతో ప్రణాళికాబద్ధంగా ఎమ్మెల్యే పని చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి చిట్టిబాబు, నీటి సంఘం సభ్యులు గర్తం కొండలరావు, మాజీ సర్పంచ్ కొల్లి రమేష్, జెఇ టి.రాజశేఖర్, మీనాక్షి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తుంగపేటలో ఆక్రమణల కారణంగా మూడు నెలలుగా నిలిచిపోయిన సిసి రహదారి నిర్మాణానికి అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. గ్రామంలో రూ.12 లక్షలతో రావిచెట్టు నుంచి సారపుగెడ్డ వరకు సిసి రహదారి, కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే రహదారి మధ్యలో ఆక్రమణల కారణంగా నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ ఆక్రమణలను తొలగించాలని సచివాలయ కార్యదర్శి నోటీసులు అందించినా ఆక్రమణదారుడు తొలగించకపోవడంతో అర్ధాంతరంగా నిర్మాణపనులు నిలిచిపోయాయి. దీనిపై సర్పంచ్ పప్పుల వేణుగోపాలరావు ఎంపిడిఒ, తహశీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నిర్వహించి ఆక్రమణ స్థలం ప్రభుత్వ స్థలంగా అధికారులు గుర్తించి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించినా ఆక్రమణదారుడు స్పందించకపోవడంతో ఎస్ఐ వి. సత్యనారాయణ, పోలీసు భద్రత మధ్య ఎంపిడిఒ మన్మధరావు ఆక్రమణలను తొలగించారు. దీంతో రహదారి నిర్మాణ పనులకు అడ్డంకులు తొలగి ప్రారంభం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.



పోలీసుల సమక్షంలో అక్రమణలు తొలగిస్తున్న అధికారులు

నిర్లక్షానికి గురైన మైనర్లకు ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి- పర్లాకిమిడి

నిర్లక్షానికి గురైన మైనర్లను ప్రభుత్వం దత్తతు తీసుకొంటుందని గజపతి జిల్లా న్యాయ సేవల అథారిటీ చైర్మన్ జగదీష్ ప్రసాద్ మహంతి, కార్యదర్శి బిమల్ రౌలో సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథౌరిటీ (ఎన్ఎఎల్ఎస్ఎ) న్యూఢిల్లీ, ఒడిశా రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఒఎస్ఎల్ఎస్ఎ) కటక్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 26 వరకు అనుసంధానం చేస్తామన్నారు. పద్దెనిమిది సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న నిర్లక్షానికి గురైన పిల్లలను గుర్తించి వారు నివసిస్తున్న ప్రదేశాన్ని అనుసంధానం చేసి వివిధ ప్రభుత్వ పథకాల్లో చేర్చేందుకు చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఇటువంటి పిల్లలు ఎవరి దృష్టిలో పడినా స్థానిక ఆశ, సంక్షేమ అధికారి, జిల్లా న్యాయ సేవా అధికారులకు తెలియజేయాలని తెలిపారు.



శ్యామలరావు మృతదేహం

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని కమ్మసిగడాం పంచాయతీ లోచర్లపాలెం గ్రామానికి చెందిన సింక శ్యామలరావు (29) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం గురువారం సాయంత్రం గ్రామానికి సమీపంలో ఉన్న మర్రి చెరువు దగ్గర పురుగులు మందు తాగి కేకలు వేయటంతో ఉపాధి పని ముగించుకొని ఇంటికి వస్తున్న సింక రాజు గమనించి వెంటనే కొండములగాం సిహెచ్‌సికి తీసుకువెళ్లారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో 108లో జిల్లా కేంద్రంలో ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు అన్నయ్య శివ శంకర వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్. పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడుకి తండ్రి సూరప్పయ్య, అన్నయ్య, వదినలు ఉన్నారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని తాళ్లవలస పంచాయతీ బొడ్డపాడులో శుక్రవారం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. బొడ్డపాడుకు చెందిన కాలరి నారాయణరావుకు చెందిన ఆవు శుక్రవారం 10 గంటల సమయంలో మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో మృతి చెందింది. గతంలో అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని, కిందకు ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయని, ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తులో పెట్టాలని దానికి సంబంధించిన నిధులు ఎంపీ నిధులు మంజూరు చేసినా ఎఇ నిర్లక్ష్యంగా పనులు చేయకపోవడంతోనే ప్రమాదం జరిగి ఆవు మృతి చెందిందని గ్రామస్తులు ఆరోపించారు. తమకు రూ.80 వేలు నష్టం వాటిల్లిందని వాపోయారు. దీనిపై లావేరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. నష్ట పరిహారం మంజూరు చేయాలని, తమకు జీవనోపాధినిచ్చే గోవు మృతి చెందడంతో విలపించారు. ఎంపీ, ఎమ్మెల్యే చెప్పినా విద్యుత్‌శాఖ ఎఇకి లెక్కలేదన్నారు.

రెండిళ్లలో చోరీ

పలాస: మండలంలోని నారాయణపురానికి చెందిన అంధవరపు బాలకృష్ణ, అంధవరపు సలోచనలకు చెందిన ఇళ్లల్లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశాఖపట్నంలో బాలకృష్ణ పనిచేస్తున్నారు. ఈ నెల 21న బాలకృష్ణ అరతులం బంగారం ఆభరణాలు బీరువాలో పెట్టి తిరిగి వెళ్లిపోయారు. ఆయన ఇంట్లో చోరీజరిగినట్లు ఆయన సోదరుడు ఫోన్ చేయడంతో బుధవారం వచ్చి పరిశీలించి బంగారం మాయమైనట్లు గుర్తించారు. అదేవిధంగా ఉపాధి కూలీగా పనిచేస్తున్న సులోచన ఇంట్లో లేని సమయంలో అప్పుగా తీసుకొచ్చిన డబ్బులు, దాచుకున్న డబ్బులు మొత్తం రూ.50 వేలు నగదు బీరువాలో పెట్టింది. గురు తెలియని వ్యక్తులు ఇంట్లో దూరి బీరువా విరగ్గొట్టి డబ్బులు కాజేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా స్వాధీనం

కవిటి: మండలంలోని గొర్లెపాడుకు చెందిన కరగాన కృష్ణారావు వద్ద 300 నాటుసారా కవర్లు స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేసి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ మొబైల్ సిఐ జి.వి. రమణ తెలిపారు. నాటుసారా నివారణలో భాగంగా గొర్లెపాడు కూడలి వద్ద తనిఖీలు నిర్వహించి కృష్ణారావు వద్ద సరుకు స్వాధీనం చేసుకుని అతన్ని ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్‌ను తరలించినట్టు తెలిపారు. ఈ నాటుసార కవర్లు బల్లిపుట్టుగకి చెందిన తలగాన బెన్ను, ఎర్ర భైరాగికి సరఫరా చేస్తున్నట్టు నిందితుడు చెప్పడంతో వారిద్దరిపైనా కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో మొబైల్ పెట్రోలింగ్ టీమ్ కానిస్టేబుళ్లు విఠల్, శ్రీను పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు

రణస్థలం రూరల్: అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవని రణస్థలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ అనురాధా దేవి ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత మద్యం షాపులు మూసివేసినా మద్యం షాపులకు చుట్టుపక్కల ఉన్న పాన్‌షాపుల్లో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఎటువంటి అక్రమ మద్యం అమ్మకాలు, బహిరంగంగా తాగటం జరగకుండా తీసుకున్నటువంటి చర్యల్లో భాగంగా ప్రతిరోజు రాత్రి 8 గంటల నుంచి రాత్రిపూట గస్తీని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరైనా రాత్రి 10 గంటలు దాటిన తర్వాత అక్రమంగా మద్యం కలిగి ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగు తుందని హెచ్చరించారు. మద్యంషాపులకు చుట్టు పక్కల ఏ సమయంలో కూడా ఎటువంటి బహిరంగ మద్యం సేవించడం, అమ్మడం చట్టరీత్య నేరమన్నారు. అదే విధంగా మద్యం షాపులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేస్తాయని అంతకు మించి ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడినా సదరు మద్యం షాపులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా అధికారులు కూడా ఈ గస్తీలను నిర్వాహిస్తారని తెలిపారు.

ఆర్‌టిసి ఉద్యోగులు సంబరాలు

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద శుక్రవారం ఎన్ఎంయు నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఇటీవల డిపో వద్ద ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని దీక్షలు, ధర్నాలు చేపట్టడంతో ప్రభుత్వం స్పందించింది. ఎట్టకేలకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు ఆదేశాలు జారీ చేయడంతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రవాణాశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ జాయింట్ సెక్రెటరీ పి.నకాని వాలి, డి.శ్రీనివాసరావు, డిపో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.